పత్తి రైతుల పరిస్థితి దయనీయం

- వ్యాపారుల నిలువు దోపిడీ
- మిల్లుల్లో తక్కువ ధరకు పత్తిని విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం

రఘునాథపల్లి: నేల తల్లిని నమ్ముకొని తెల్ల బంగారమైన పత్తి పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సీజన్ ప్రారంభంలో క్వింటా పత్తి రూ.8 వేల వరకు పలికిన ధర.. ప్రస్తుతం రూ 6,800 దాటడం లేదు. రోజురోజుకు ధరలు పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రూ 7,521 మద్దతు ధర ప్రకటించింది. కాటన్ కార్పొరేషన్ ఇండియా (సీసీఐ) మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా, సీజన్ ప్రారంభమై నెల దాటినా ప్రారంభించిన దాఖలాల లేవు. దీంతో దళారులు, వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తేమ, రంగు మారిందనే సాకుతో వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చే స్తూ నిలువు దోపిడి చేస్తున్నారు. పండుగల నేపథ్యంలో చేతిలో డబ్బులు లేక రైతులు జిన్నింగ్ మిల్లుల్లో తక్కువ ధరకు పత్తిని విక్రయిస్తూ నష్టపోతున్నారు. కొంత మంది రైతులు ఇంట్లోనే పత్తిని నిల్వచేసి సీసీఐ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు.



రఘునాథపల్లిలో తెగుళ్లు సోకిన పత్తి పంట

తగ్గనున్న దిగుబడి..

మండలంలో 23,540 ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగానే ఉండటంతో పంట ఏపుగా పెరిగిందే తప్పా కాపు మాత్రం అంతంత మాత్రంగానే వచ్చింది. చీడ పీడల ఉధృతి పెరగడంతో తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి అనేక రకాల మందులు పిచికారీ చేయాల్సి రావడంతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ. 25 వేలకు పైగా పెట్టుబడి పెరిగినా పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు తలల పట్టుకుంటున్నారు.



ధర లేక పోవడంతో ఇంట్లో నిల్వ చేసిన పత్తి

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రెండున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తే ఇప్పటికే రూ 70 వేల దాకా ఖర్చు చేసినా. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పత్తి ధరలు రోజు రోజుకు పడిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి క్వింటాల్ పత్తికి రూ 7521 మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లేనిచో పత్తి రైతులు నిండా మునిగే పరిస్థితి నెలకొంది.

- బొక్క రామచంద్రయ్య, రైతు, దాసన్నగూడెం

పెట్టుబడి పెరిగింది.. దిగుబడి తగ్గింది



తెగుళ్లతో పెట్టుబడి విపరీతంగా పెరిగింది. పంట ఏపుగా పెరిగింది తప్ప కాత రాలేదు. తెగుళ్ల నివారణకు ఐదారు సార్లు పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. గతంలో ఎకరాకు దాదాపు 10 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈ సారి కనీసం 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. జిన్నింగ్ మిల్లుల్లో వ్యాపారులు రైతులను నిలువుదోపిడి చేస్తున్నారు. సర్కార్ వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి.

- గాజులపాటి మైసారావు, రైతు, ఇబ్రహీంపూర్

క్లుప్తంగా

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



దేవరుప్పుల : పంటల సాగుకు నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. నవాబుపేట రిజర్వాయర్ కెనాల్ ద్వారా నిండిన సింగరాయచెరువు మత్తడి పోస్తుండగా ఆమె బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంజర మీదుగా వెళ్తున్న కెనాల్‌లో నీటిని పరిశీలించి సరఫరా వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువులను త్వరగా నింపాలని సదరు శాఖ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, విజయడెయిరీ పాలకవర్గం జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, నాగరాజు, రామచంద్రునాయక్, నల్ల యాదగిరి, ఓడపల్లి రవీందర్, రతన్‌జీ, రెడ్డిరాజుల రమేష్, వెంకన్న, భాస్కర్, జహంగీర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జనగామ: పట్టణంలోని అమ్మబావి ఏరియాలోని ఉప్పలమ్మ దేవాలయ నూతన కార్యనిర్వహణాధికారిగా కొండబోయిన రాములు బుధవారం బాధ్యతలు చేపట్టారు. లింగాలఘనపురం మండలం జీడికల్ శ్రీరామచంద్రస్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉప్పలమ్మ, జీడికల్ ఆలయ పూజారులు వారుణాసి పవన్ శర్మ, భార్గవ ఆచార్యులు, బుచ్చయ్యశర్మ ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేందర్ రెడ్డి, మోహన్, భరత్ కుమార్, సుధీర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు నూతన ఈవోకు అభినందనలు తెలిపారు.

పంచాయతీ రాజ్ ఏఈగా సాయి రంజిత్



బచ్చన్నపేట: మండల పంచాయతీ రాజ్ నూతన ఏఈగా సాయి రంజిత్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఉన్న ఏఈ శ్రీనివాస్‌రావుకు డీఈగా ప్రమోషన్ రాగా నూతనంగా ఎన్నికైన సాయి రంజిత్ ఏఈగా చేరారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని ఎలాంటి అభివృద్ధి పనులు ఉన్నా సకాలంలో పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. ఎంపీడీఓ మల్లికార్జున్‌కు నియామక పత్రాన్ని అందించారు.

రేషన్‌బియ్యం స్వాధీనం


జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఓ ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసి వాహనంలో తరలిస్తుండగా పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన పిల్లి వెంకటయ్య ఇల్లును ఎండీ హబీబ్‌ఖాన్ అద్దెకు తీసుకుని చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆ ఇంట్లో నిల్వ చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. కాగా, రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని హబీబ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీపీ సిబ్బంది సేవలు అభినందనీయం



బచ్చన్నపేట: గ్రామాల్లో నిత్యం సేవలందించే జీపీ సిబ్బంది సేవలు అభినందనీయమని బండనాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి భరత్ కిషోర్ అన్నారు. గ్రామ జీపీ సిబ్బందికి దసరా కానుకగా దుస్తులు, నిత్యావసర సరుకులను బుధవారం ఆయన అందజేశారు. కారోబార్ శ్రీనివాస్, నాయకులు రాజనర్సు, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరాపండగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన దాత సముద్రాల యాదగిరి-రేణుక దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జనగాం యాదగిరిల ఆధ్వర్యంలో 14 మంది కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.

డీజేలపై నిషేధం ఎత్తివేయాలని ర్యాలీ

స్టేషన్‌ఘన్‌పూర్: డీజేలపై విధించిన నిషేధాన్ని తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ డీజే సౌండ్స్ వ్యాపారులు, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక శివాజీ చౌక్ వద్ద ప్రారంభించిన ర్యాలీని బస్టాండ్ వద్ద అంబేడ్కర్ సెంటర్ వరకు చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు భూక్య సురేష్ మాట్లాడారు. తాము రూ.లక్షలు వెచ్చించి డీజే సౌండ్స్ వ్యాపారం చేస్తున్నామని, వందలాది కుటుంబాలు డీజే సౌండ్స్‌పై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. డీజే సౌండ్స్‌ను నిషేధిస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ విషయమై ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేయాలని, డీజే సౌండ్స్‌పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు కేశోజు భీష్మాచారి, నాయకులు రజాక్, లింగమూర్తి, గోరంతల రాజు, నీల రాకేష్, మజర్, నాగరాజు, వికాష్, పవన్, సాంబ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో డీజే నిర్వాహకులు

తహసీల్దార్, ఎస్సైకి వినతి

లింగాలఘణపురం: డీజే సౌండ్స్ అండ్ లైటింగ్‌లతో జీవనోపాధి పొందుతున్న తమకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ బుధవారం మండలంలోని హన్‌మాన్ డీజే సిస్టమ్ లైటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్, ఎస్సై శ్రావణ్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. డీజే సౌండ్స్‌కు అనుమతులు లేవని చెప్పడంతో తమ కుటుంబాలు వీధిన పడుతాయని, షరతులతో కూడిన అనుమలు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

హామీలు వెంటనే నెరవేర్చాలి

లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కుందారంలో సీపీఎం సమావేశం చింత ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కనకారెడ్డి హాజరై మాట్లాడారు. రేషన్‌కార్డులు, రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు రూ.2,500లు ఇలా ఏ ఒక్క హామీలను అమలు చేయలేదన్నారు. మండల కార్యదర్శి కరుణాకర్, మండల కమిటీ సభ్యుడు తూడి దేవదానం, ఎల్లయ్య, చంద్రయ్య, యాకమ్మ, జయమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొనగా గ్రామశాఖ అధ్యక్షుడిగా పాలమాకుల యాదగిరి ఎన్నుకున్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

బీమా చెక్కు అందజేత

జనగామ: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఎండీ కైసర్ పాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, పార్టీ సభ్యత రుసుము ఇన్సూరెన్స్‌కు సంబంధించి రూ.2 లక్షల సొమ్ము మంజూరైంది. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో బుధవారం బీమా చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, పేర్ని స్వరూప, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగుల సందీప్, దేవునూరి సతీష్ ఉన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్

జనగామ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ సమయంలో డీఎస్సీ నిర్వహించి.. ఫలితాలు ప్రకటించి నియామకాలు చేపట్టడం హర్షనీయమన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు పెండింగ్ డీఏలు విడుదల చేయాలని కోరారు. ముఖ్యంగా సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, మంగు జయప్రకాష్, సుధాకర్, శ్రీనివాస్, యాదవరెడ్డి, శ్రీహరి, కృష్ణ, వెంకటేష్, వెంకటరమణ, కనకయ్య ఆగయ్య, ఉప్పలయ్య, బాలకిషన్, జంపయ్య, నర్సయ్య, నర్సింహులు,మహేష్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

సంక్షిప్తంగా

యోగాతో ఆరోగ్యం



బచ్చన్నపేట: యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని యోగా గురుజీ నారాయణస్వామి అన్నారు. మండలంలోని కొడవటూర్ దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించనున్న యోగా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం కోసం యోగాను తప్పనిసరిగా చేయాలన్నారు. యువకులు పాల్గొన్నారు.

పెన్షన్ డబ్బులు చెల్లించాలి

చిల్పూరు: ఏడు నెలలుగా ఇవ్వని పెన్షన్ డబ్బులను వెంటనే ఇవ్వాలని పెన్షనర్ల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంరెల్లిలు కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు మాట్లాడారు. ఉద్యోగ సమయంలో కూడబెట్టిన డబ్బును జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ బకాయిలను పెన్షన్ రూపంలో ఇచ్చేందు ఆలస్యం చేయడం సరికాదన్నారు. వెంటనే బిల్లులు చెల్లించకుంటే ఆందోళనలు చేపడతామన్నారు.

స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్(స్కావంజర్) పోస్టు నియామకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు కేజీబీవీ ప్రత్యేకాధికారి పి.సుకన్య తెలిపారు. ఆసక్తి కలిగిన స్థానిక మహిళలు ఈ నెల 15వ తేదీ లోపు తగు వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చనని, వివరాలకోసం 8106916027 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి అభిమన్‌గాంధీ ఉపవాస దీక్ష

కొడకండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేయడంలో విఫలమైనందున ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ఉపవాస దీక్షను చేపడుతున్నట్లు జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్ గాంధీనాయక్ తెలిపారు. కొడకండ్ల మండలం గిర్నితండలోని తన నివాసం వద్ద 48 గంటల ఉపవాస దీక్షను చేపడుతున్నానని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగి పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలన్నదే తన సంకల్పమని ఆయన తెలిపారు.

గుంతల పూడ్చివేత

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ జాతీయ రహదారిలోని పల్లగుట్ట క్రాస్ నుంచి దేశాయితండా, పల్లగుట్ట వరకు రోడ్డు గుంతలమయంగా మారి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన పొట్లపల్లి శ్రీధర్‌రావు బుధవారం సొంత ఖర్చులతో మట్టితో గుంతలు పూడ్చి వేయించారు. నాగరాజు, బాపునాయక్, వెంకట్రాజం, ఆనందం, బొట్టు చేరాలు, బాబన్న, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు వరుస సెలవులు

స్టేషన్‌ఘన్‌పూర్: సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగురోజులు(ఈనెల 10 నుంచి 13వ తేదీవరకు) సెలవులు ఉంటాయని కార్యదర్శి జన్ను భాస్కర్ తెలిపారు. మార్కెట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ నేటి నుంచి ఈనెల 13వరకు నాలుగు రోజులు బంద్ ఉంటుందని, రైతులు, వ్యాపారులు, గుమాస్తాలు, దడువాయిలు గుర్తించాలని తెలిపారు. సెలవు రోజుల్లో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు. ఈనెల 14న(సోమవారం) మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని తెలిపారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో భాషిపాక కొమురయ్య మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మహేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేశ్ తదితరులు మృతదేహానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రఫేల్‌రెడ్డి, మజార్‌పాషా, పడమటింటి బిక్షపతి, బక్కాజీ తదితరులు ఉన్నారు.

కాన్షీరాం వర్ధంతి

పాలకుర్తి టౌన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, కాన్షీరాం వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ చౌరస్తాలో కాన్షీరాం చిత్రపటానికి బీఎస్పీ నాయకులు నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ అధ్యక్షుడు ఇదునూరి ప్రసాద్, ఉపాధ్యక్షలు వేల్పుకొండ కుమారస్వామి, చింత గణేష్, చింత ప్రసాద్, ఇదునూరి శ్రీకాంత్, మంగళ్లపల్లి శ్రీకాంత్, సంకినిని రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం కుంకుమార్చన, హోమం, శ్రీలలితా పారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి పలువురు అధికారులు, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

- సాక్షి నెట్‌వర్క్



జనగామ: 10వ వార్డులో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు



జనగామ: శ్రీవిల్లాస్‌కాలనీలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



జనగామ: పూజలు చేస్తున్న స్వాములు



జనగామ: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో హోమం చేస్తున్న భక్తులు



బచ్చన్నపేటలో..



సోమేశ్వరాలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు



జనగామ: తహసీల్ వద్ద అన్నదానంలో భక్తులు



చిల్పూరు: చిన్నపెండ్యాలలో అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి



లింగాలఘణపురం: నెల్లుట్లలో..



జనగామ: పాతబీటు బజార్‌లో..



దేవరుప్పల: పెద్దమడూరులో..



స్టేషన్‌ఘన్‌పూర్: పూజలో సీఐ తదితరులు

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



బచ్చన్నపేట: సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రదేశాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎస్సై ఎస్‌కే.హమీద్ అన్నారు. మండల కేంద్రంలో బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువును ఎంపీడీఓ మల్లికార్జున్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి, కానిస్టేబుళ్లు జమాలొద్దీన్, అనిల్ ఉన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ హెడ్ భాస్కర్ అన్నారు. ఘన్‌పూర్ బస్టాండ్ ఆవరణలో వరంగల్ షీటీమ్ పోలీస్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను అదుపు చేయడానికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈవ్ టీజింగ్, బస్సుల్లో ఆకతాయిల విషయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పెట్టవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు వెంటనే ఫిర్యాదు చేయాలని, మహిళలకు ఎవరి నుంచైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు.



మాట్లాడుతున్న షీటీమ్ హెడ్ భాస్కర్

పాలకుర్తి నుంచి ఆరుగురికి టీచర్ ఉద్యోగాలు



పాలకుర్తి నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన రాపర్తి సుర్జీత్, జీవంజీ ప్రణయ్, శివరాత్రి శ్రీలత, శేర్ల వీణ, శేర్ల విద్యావతి, తాళ్లపల్లి భవాని టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో వీణా, విద్యావతి శేర్ల విజేయుడు-సాంబలక్ష్మి దంపతుల కుమార్తెలు. జీవంజీ ప్రణాయ్ హైదరాబాద్‌లో పోస్టల్ డిపార్ట్ మెంటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. తాళ్లపెల్లి భవానిమండల కేంద్రంలోని విశ్వాస్ డిగ్రీ కళాశాల డైరెక్టర్‌గా ఉన్నారు. వీరంతా బుధవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్నారు.